## క్లుప్తంగా

### మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): ఉన్నత న్యాయస్థానాల ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు ఆదేశాలతో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ఆ కార్యాలయంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 40 గంటల శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మధ్యవర్తిత్వ విశిష్టతను వివరించారు. చెన్నైకు చెందిన రిసోర్స్ పర్సన్లు రత్నతార, శశిదేవి, కర్నూలు, కడప, చిత్తూరుకు చెందిన మధ్యవర్తిత్వ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సైనికుడి మృతి



విజయ్య (ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని స్టాంటన్‌పురంలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు విజయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. విజయ్య ఆర్మీలో హవల్దార్‌గా పనిచేసి రిటైర్డు అయిన అనంతరం స్థానిక ఆల్కలీస్ ఫ్యాక్టరీలో పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన మృతి పట్ల సంక్షేమ సంఘం తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ సైనికుల కుటుంబాలకు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

### మర్యాదపూర్వక కలయిక



ఎస్పీ బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

కర్నూలు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందుమాధవ్‌ను ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎన్‌జీఓస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ చైర్మన్ పీసీహెచ్ వెంగళరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం డీపీఓలోని ఆయన కార్యాలయానికి వెళ్లి పూలబొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. కర్నూలు నగర అధ్యక్షుడు ఎస్.సి.కాశన్న, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు, కోడుమూరు తాలూకా కార్యదర్శి వలి తదితరులు ఉన్నారు.

### ఇన్‌చార్జ్ కమిషనర్‌కు పూర్తి బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న పి.వి.రామలింగేశ్వర్‌కు పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్.ఎ.సీ) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21వ తేదీన నగరపాలక కమిషనర్‌గా పనిచేస్తున్న భార్గవ్‌తేజ గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న రామలింగేశ్వర్‌కు పరిపాలన ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి బాధ్యతలు అప్పగించారు.

### మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలను అరికట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, ఎస్.అలివేలు విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటయోధురాలు కెప్టెన్ లక్ష్మీసెహగల్ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీనగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. మహిళలు, చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా నివారించడంలో పోలీసులు విఫలమయ్యారని, అధికారి పార్టీకి కొమ్ముగాస్తున్నారని ఆరోపించారు. నాయకులు రాధిక, మంజుల, ఊర్మిళ, చిట్టి, అరుంధతి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ కోతలు

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లు, లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేంద్రబాబు తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని మద్దూరు నగర్, సి.క్యాంప్, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, సాయివైభవ్ నగర్, చెక్‌పోస్టు ప్రాంతం, శేషాద్రి నగర్, బృందావన్ నగర్, మారుతీ నగర్, అరుంధతీ నగర్, పరిసర ప్రాంతాలు రెవెన్యూ కాలనీ, శ్రీరాం నగర్, మారుతీ మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మి నగర్, కమలా నగర్, టెలికాం నగర్, గఫార్ నగర్, పరాసతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ప్రాంతం, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్ కాలనీ, మాధవనగర్, బి.క్యాంప్, గాయత్రి ఎస్టేట్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఆటోలపై నిఘా

- ప్రతి వాహనానికి ప్రత్యేక నంబర్ కేటాయింపు
- అన్ని వివరాలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు
- 20 వేలకు పైగా ఆటోలు

కర్నూలు: నగరంలో తిరుగుతున్న ఆటోలు ఇక నుంచి నిఘా నీడలో ఉండనున్నాయి. అందుకోసం వాటికి ప్రత్యేక నంబర్లను కేటాయిస్తున్నారు. ప్రతి ఆటోకు సంబంధించిన పూర్తి సమాచారం ఇక నుంచి ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఉండనుంది. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా, ఆటోలు చోరీకి గురైనా, ఆటోలో ఎక్కినవారు తమ వస్తువులను మర్చిపోయినా, వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులకు క్షణాల్లో సమాచారం చేరుతుంది. ఇందుకు నగరంలో తిరుగుతున్న ప్రతి ఆటోకు ట్రాఫిక్ పోలీసులు, అధికారులు ప్రత్యేక నంబర్లను కేటాయిస్తున్నారు. కర్నూలులోని సి.క్యాంప్, రాజ్‌విహార్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, చౌరస్తా సమీపంలోని విద్యుత్ భవన్ వద్ద (శేఖర్ కమ్యూనికేషన్స్, గుంటూరు) వారు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆటోలకు నంబర్లను కేటాయిస్తున్నారు. మూడేళ్ల క్రితం సుమారు 14 వేల ఆటోలకు టాప్ నంబర్లు కేటాయించారు. కాల పరిమితి పూర్తి కావడంతో ప్రస్తుతం రెన్యూవల్‌తో పాటు కొత్త వాహనాలకు కూడా నంబర్లను కేటాయిస్తున్నారు.

**సీసీ కెమెరాలకు స్పష్టంగా కనిపించేలా...**

నగరంలోని కూడళ్లు, ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలకు ఆటో నంబర్లు కనిపించేలా వాహనానికి నాలుగు వైపులా రాయిస్తున్నారు. ప్రతి ఆటోకు చెందిన వాహన యజమాని పేరు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సీ నంబర్ తదితర వివరాలు కంప్యూటరీకరణ చేయిస్తున్నారు. వాహన డ్రైవర్లకు చెందిన ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. రెండు రోజుల్లో దాదాపు 3 వేలకు పైగా ఆటోలకు టాప్ నంబర్లు కేటాయించారు.



టాప్ నంబర్ల కేటాయింపు కోసం ఆటో డ్రైవర్ల వివరాలను నమోదు చేసుకుంటున్న దృశ్యం





ఆటోకు కేటాయించిన టాప్ నంబర్‌ను చూపుతున్న డ్రైవర్

**20 వేలకు పైగా ఆటోలు**

నిత్యం 20 వేలకు పైనే ఆటోలు నగరంలో తిరుగుతున్నాయి. రోజుకు వేలాది మందిని రవాణా చేస్తున్నాయి. నిత్యవసర సరుకులు, కూరగాయలు, పాఠశాలల విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల రవాణాకు ఉపయోగపడుతున్నాయి. కొంతకాలంగా ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు కూడా చోరీకి గురవుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి వాటిపై నిఘా కోసం టాప్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను పునరుద్ధరించారు.

**ఆటోవాలాలకు సంబంధించి నమోదైన నేరాలు**

- బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన కొత్తూరు శేఖర్‌రెడ్డి కర్నూలుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఆటో ఎక్కాడు. అదే దారిలో కొంచెం ముందుకు వెళ్లిన తర్వాత సర్వీస్ రోడ్డు నుంచి చీకటిలోకి తీసుకెళ్లి రూ.5 వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు.
- తుగ్గలికి చెందిన జయచంద్రను కేసీ కెనాల్ వద్ద బెదిరించి రూ.6 వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు.
- రాయలసీమ యూనివర్సిటీలో చదువుతున్న ఓ విద్యార్థిపై కూడా ఇదే తరహాలో బెదిరింపులకు పాల్పడి సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఈ తరహా ఫిర్యాదులు నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పదుల సంఖ్యలో వస్తున్నప్పటికీ కేసులు నామమాత్రంగా నమోదవుతున్నాయి.
- బస్టాండ్ సమీపంలో ఆటో ఎక్కిన ఓ మహిళను హంద్రీ బ్రిడ్జి వద్ద నగల కోసం బెదిరించారు. ఆమె కేకలు వేస్తూ కిందకు దిగి తప్పించుకుంది.
- నగర శివారులోని కళాశాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కిన ఓ యువతిని డ్రైవర్ వేధింపులకు గురిచేశాడు. పరువు పోతుందని భయపడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

**ఆటోవాలాల ముసుగులో జరిగిన నేరాలు**

| సంవత్సరం | 2021 | 2022 | 2023 | 2024 (జూన్ వరకు) |
|---|---|---|---|---|
| నేరాల సంఖ్య | 24 | 36 | 39 | 17 |

**వాహనాల దొంగతనాలు.. రికవరీ వివరాలు**

| సంవత్సరం | నమోదైన కేసులు | రికవరీ చేసిన వాహనాలు |
|---|---|---|
| 2021 | 160 | 70 |
| 2022 | 146 | 33 |
| 2023 | 163 | 44 |
| 2024 (జూన్ వరకు) | 124 | 21 |

**అన్ని అర్హతలు ఉన్నవారే ఆటో నడిపేలా చర్యలు**



అన్ని అర్హతలు ఉన్నవారే ఆటోలు నడిపేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ఆటో సంఘాల నాయకులతో చర్చించాం. ఆటోవాలాలు నేరాలకు పాల్పడకుండా తరచూ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆటోలకు టాప్ నంబర్లు కేటాయించే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఆటో నిర్దేశించిన ప్రాంతానికి వెళ్లి టాప్ నంబర్ కేటాయించుకోవాలని డ్రైవర్లకు కూడా సూచించాం. – గౌతమి, ట్రాఫిక్ సీఐ

**లైసెన్స్ మేళా ఏర్పాటు చేయాలి**



ఆటోలకు టాప్ నంబర్లు కేటాయించడం చాలా ఉపయోగం. రిజిస్ట్రేషన్ నంబర్ కంటే టాప్ నంబరే ఎక్కువగా ప్రయాణికులు గుర్తు పెట్టుకుంటున్నారు. క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న స్టిక్కర్‌ను స్కానర్‌తో క్లిక్ చేయగానే సమాచారం పూర్తిగా తెలిసిపోతుంది. దీంతో పాటు ఆటో నడుపుతున్న వారికి లైసెన్స్‌లు ఉండటం లేదు. రోజువారీ అద్దెకు తీసుకుంటున్నారు. అద్దెకు ఇచ్చే వారు లైసెన్స్ ఉందా లేదా అని పరిశీలించడం లేదు. అలాంటి వారి కోసం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– ఈశ్వర్, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

### గుండమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

కర్నూలు(సెంట్రల్): అగ్రవర్ణాల చేతిలో హత్యకు గురైన ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన గుండమ్మ కుటుంబానికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి మారెప్ప డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను కలిసి విన్నవించారు. గుండమ్మను అత్యంత కిరాతకంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి టీడీపీ నాయకులు హత్య చేసిన విషయాన్ని కమిషన్ సభ్యుడు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లో హత్యలు పెరిగాయని, నివారించడంలో ప్రభుత్వం విఫలమైనట్లు చెప్పారు. గుండమ్మ కుటుంబంలో ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరినట్లు ఆయన వివరించారు.

### 29 నుంచి రైతు సంఘం శిక్షణ తరగతులు

కర్నూలు(సెంట్రల్): జూలై 29, 30, 31 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు 26 జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతు సంఘం నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### పత్తికొండ పీఆర్ డీఈఈగా శేషయ్య

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పత్తికొండ పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌కు డీఈఈగా ఎం.శేషయ్యను నియమిస్తూ ఇంజినీర్ ఇన్ చీఫ్ బీ.బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పత్తికొండ డీఈఈగానే విధులు నిర్వర్తించిన శేషయ్య కొంత కాలం క్రితం పీఆర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. తిరిగి ఆయన్ను పత్తికొండకు నియమిస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# ఐక్యతతోనే విజయం

- స్టాండింగ్ కమిటీకి అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ
- పార్టీ కార్పొరేటర్లందరికీ విప్ జారీ చేస్తాం
- ప్రత్యర్థికి ఓటు వేస్తే.. అనర్హత వేటు తప్పదు
- సమావేశంలో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని, ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): ప్రభుత్వం మారింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో అధికార టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఫోన్లు చేసి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వాటిని తిప్పికొడదాం. ఐక్యంగా ఉండి స్టాండింగ్ కమిటీకి పార్టీ తరపున పోటీ చేస్తున్న ఐదుగురిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ పిలుపునిచ్చారు. విజయవాడ నగరపాలకలో టీడీపీ ఇబ్బందులు సృష్టించినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిచారని గుర్తు చేశారు. శుక్రవారం నగర శివారులోని ఒక హోటల్‌లో నగరపాలక మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారామ్మ స్టాండింగ్ కమిటీకి పోటీచేసే అభ్యర్థులను ప్రకటించారు. పోటీ చేసే వారిలో ఎం.విక్రమసింహారెడ్డి (40వ వార్డు), మిద్దె చిట్టెమ్మ (31వ వార్డు), పి.జుబేర్ అహమ్మద్ (7వ వార్డు), షేక్ యూనస్‌బాషా (10వ వార్డు), అన్నెపోగు క్రాంతికుమార్ (12వ వార్డు) ఉన్నారు. వీరందరికీ పార్టీ బీ ఫారంలు ఇవ్వనుంది. నామినేషన్లు దాఖలుచేసిన మిగతా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఉపసంహరించుకోవాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 1న నగరపాలక స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనాలని, పార్టీ కార్పొరేటర్లందరికీ విప్ జారీ చేస్తామన్నారు. ఇటీవల ఆరేడుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారని, వారిని పట్టించుకునే నాథుడే లేడన్నారు. మేయర్ బీవై.రామయ్య మాట్లాడుతూ.. పార్టీ పెద్దలు నిర్ణయించిన ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను గెలిపించుకుందామన్నారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని అందరం పార్టీ కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీని వీడిన వారికి అనర్హత తప్పదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మన బలం చాటుదామన్నారు. వరుసగా నాలుగోసారి స్టాండింగ్ కమిటీ సభ్యులను గెలిపించుకొని ఐక్యతను చాటుదామన్నారు. స్టాండింగ్ కమిటీలో స్థానం ఆశించి, అర్హత కలిగి అవకాశం రాని వారికి వచ్చే నెలలో పార్టీ పదవులతో గౌరవిస్తామన్నారు. నగరపాలక డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకులు అరుణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, పక్కన మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి



హాజరైన కార్పొరేటర్లు

### అప్రోచ్ రోడ్డు లేని గ్రామాలను గుర్తించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా,పాల్గొన్న జిల్లా అధికారులు

కర్నూలు: అప్రోచ్ రోడ్డు లేని గ్రామాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో రోడ్ల నిర్మాణంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు రెండు కి.మీ.లోపు దూరం ఉంటే ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. ఆర్అండ్‌బీ పరిధిలో.. గుంతలు పడిన 39 రోడ్లకు మరమ్మతులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను గుర్తించాలన్నారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిన రోడ్లను ఫేజ్-1 కింద బాగు చేయాలన్నారు. కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేయించాలని, ఫౌంటేన్‌కు మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్, పంచాయతీరాజ్ ఈఈ మద్దన్న, డీఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీ పరిధిలోని చిదంబరరావు సచివాలయంలో జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలోని గృహాలను సందర్శించి గృహస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని అన్ని గృహాలను సందర్శించి నీటితొట్టెలు, కూలర్, ఫ్రిడ్జ్, టైర్లు, పాత బాటిళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య పనులు, హైపో పిచికారీ ముమ్మరం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వాంతులు, విరేచనాలు ఉంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వాలన్నారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లల తల్లులకు వివరించారు. డీపీఎం ప్రసాద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలోని మెరిడియన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుధవారపేట 15వ వార్డులో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత, శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని తారకరామనగర్‌లోని కేశవరెడ్డి స్కూల్, మారుతినగర్ స్కూల్‌లో డెమో శ్రీనివాసులు తనిఖీ చేశారు. గృహిణులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ పర్వీన్ తబసుం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం.మురళీమోహన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ ఉన్నారు.



నిల్వ నీటిలో దోమల పెరుగుదల గురించి వివరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

### మచ్చలేని నాయకుడు శిఖామణి

కర్నూలు (సిటీ): కోడుమూరు మాజీ ఎమ్మెల్యే ఎం.శిఖామణి మచ్చలేని నాయకుడని వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం శిఖామణి 16వ వర్ధంతి కార్యక్రమం మునగాలపాడు సమీపంలోని ఘాట్‌లో నిర్వహించారు. పాల్గొన్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.మణిగాంధీ, వారి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో సామాన్య ప్రజలకు సైతం శిఖామణి అండగా నిలిచారని గుర్తుచేస్తుకున్నారు. నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, కరుణాకర్‌రెడ్డి, శేఖర్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి తదితరులు

### అలరించిన నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటకాలు, నృత్య ప్రదర్శన పోటీల్లో శుక్రవారం 'శ్రీకృష్ణ కమల పాలిక' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను అలరించింది. అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు బి.ఎస్.రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, నాటక దర్శకులు పత్తి ఓబులయ్య, కళాకారులను సన్మానించారు.

### కార్గిల్ అమరవీరులకు నివాళి

కర్నూలు (అర్బన్): పాతికేళ్ల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరజవాన్ల మృతికి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్రా పేరయ్య మాట్లాడుతూ.. ఎంతో చలిగా ఉన్న ఆ ప్రదేశంలో మన సైనికులు వీరోచితంగా జరిపిన పోరాటం వల్లే భారతదేశానికి విజయం సిద్ధించిందన్నారు. కోశాధికారి నజీర్ అహ్మద్, కార్యదర్శి సుధాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోగులతో మర్యాదగా నడుచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గర్భిణి శశికళ విషయంలో వైద్యుల నిర్లక్ష్యం లేదని విచారణలో తేలిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. గర్భిణి శశికళ ఉదంతంపై శుక్రవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో విచారణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణి ఓపీ టికెట్ ఎవ్వరూ చించలేదని, వారే నిర్లక్ష్యంగా పోగొట్టుకున్నారని, ఈ విషయమై కొంత గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. తిరిగి ఓపీ టికెట్ తీసుకొచ్చాక ఆమెను ఆసుపత్రిలో చేర్చుకున్నట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రసవానికి వచ్చే గర్భిణులకు ఓపీ ఇచ్చి డెలివరీ రూమ్‌లో వారిని పరీక్షించిన తర్వాత అడ్మిట్ చేసుకోవాలని, ఆ తర్వాతే అవసరమైన పరీక్షలు చేయాలని హెచ్‌ఓడీని ఆదేశించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్, గైనిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

### ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా

కర్నూలు(సెంట్రల్): ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం విజయవాడ నుంచి ఇసుక ఆపరేషన్స్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏడాదిలో ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు ఇసుకను అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించాలని, మరో 15 రోజుల్లో డిస్టిల్లింగ్ పాయింట్లలో ఇసుకను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు సంబంధించి వాహన యజమానుల నుంచి అధిక ధర వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, డీటీసీ శ్రీధర్, డీపీఓ నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్ పాల్గొన్నారు.

### మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరామిరెడ్డి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద గురువారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణలో మద్యం సేవించి వాహనాలపై కర్నూలుకు వస్తూ తొమ్మిది మంది పట్టుబడడంతో వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పడంతో కర్నూలు శివారులోని పంచలింగాల వద్ద ఉన్న జిల్లా జైలుకు తరలించారు.

### హెపటైటిస్‌పై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): హెపటైటిస్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని విశ్వభారతి మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ డి.కాంతారెడ్డి సూచించారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెంచికలపాడులో అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ డి.కాంతారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు హెపటైటిస్ గురించి అవగాహన కల్పించి, వ్యాధి నివారణకు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు.అనంతరం మైక్రోబయాలజీ విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహమ్మద్, డాక్టర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ సేవల్లో లోపాలు రానీయొద్దు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో పరిశ్రమలు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక పవర్ హౌస్‌లో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, లైన్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు మెయింటెనెన్స్ పనులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈఈ ఓబులేసు, కర్నూలు-1 ఏడీఈ నాగప్రసాద్, కర్నూలు-2 ఏడీఈ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.